క్లుప్తంగా

నియామకం



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న కాలనీవాసులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని సీఎస్‌కే విల్లాస్ అభివృద్ధి నూతన కమిటీని శనివారం కాలనీ పెద్దల సమక్షంలో ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా బంటారం మహేశ్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత కమిటీ పదవీకాలం 2025 ఏప్రిల్ 18తో ముగియడంతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గతంలో మూడు ప్యానల్‌లకు సంబంధించిన సభ్యులు పోటాపోటీగా నిలబడటంతో ఎన్నికలు ఉద్రిక్త వాతావరణంలో కొనసాగాయి. ఈసారి కాలనీ పెద్దలు ఏకతాటిపైకి వచ్చి నూతన కమిటీని సజావుగా ఎన్నుకునేందుకు అన్ని ప్యానెల్ సభ్యులతో చర్చించి అభ్యర్థుల ఎంపికను ఏకగ్రీవంగా నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా ఇంజమూరి గోపాల్, పోలెపల్లి రమేష్, శ్రీకాంత్‌రెడ్డి, మ్యాన అరుణ, భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బీఎల్‌వి.ప్రసన్నకుమార్, కోశాధికారిగా మ్యాన బాలకృష్ణ, సహాయ కార్యదర్శులుగా పర్వతాపురం భిక్షపతి, ఎక్‌బోటే, దత్తాత్రేయ, నాగిళ్ల కిషోర్, ప్రశాంత్, రాఘవేందర్‌రెడ్డి, సునీత, సభ్యులుగా మహేశ్, నరేందర్, రవివర్మ, నరేందర్, లక్ష్మి, విజయలక్ష్మి, రామసుబ్బారావు, సుభాషిణి, వినయ్, సందీప్‌గౌడ్, జ్ఞానేశ్వర్, పరంధాములుగౌడ్, మురళీకృష్ణ, నరేశ్, రాజు, న్యాయ సలహాదారులుగా విజయ్‌కుమార్, ఇంజమూరి నర్సింలు, హరికిషన్, హరీష్, మీడియా ఇన్‌చార్జిలుగా బంటారం రాఘవేందర్‌గౌడ్, సందీప్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సభ్యులను పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలను తెలియజేశారు. కార్యక్రమంలో విల్లాస్ గౌరవ అధ్యక్షుడు అరటి యాదయ్య, సలహాదారు కమిటీ సభ్యులు హరిభూషణ్‌పటేల్, చంద్రశేఖర్, మనోహర్, వెంకటయ్యయాదవ్, దిడ్డి గోపాల్‌నారాయణ, నాగిళ్ల కుమార్, నాగిళ్ల ప్రభాకర్, డాక్టర్ శివానంద్, డాక్టర్ చందూలాల్‌రాథోడ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు గడ్డి అందజేత



శ్రీకృష్ణ గోశాలకు గడ్డి అందజేస్తున్న దాతలు

షాద్‌నగర్‌రూరల్: గో మాతకు సేవచేస్తే ఎంతో పుణ్యఫలం లభిస్తుందని మాజీ కౌన్సిలర్ లతాశ్రీ శ్రీశైలం అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ గ్రామానికి చెందిన గోవర్ధన్ శనివారం పట్టణ సమీపంలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో గల శ్రీకృష్ణ గోశాలకు గడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ మాట్లాడుతూ.. గో మాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనన్నారు. గో సంతతి అంతరించిపోకుండా రక్షించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. గో సేవ మహాపుణ్యమని, ప్రతి ఒక్కరూ గోవులను పూజించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకొని సామాజిక సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని కోరారు. మూగజీవాల రక్షణకు మనవంతు సహాయ సహకారాలను అందించాలన్నారు. అనంతరం గడ్డి దానం చేసిన దాతను ఆయన అభినందించారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే కాలె యాదయ్య



బీఆర్ నాయుడికి ధన్యవాదాలు తెలుపుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును ఎమ్మెల్యే కాలె యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం సాయంత్రం నగరంలోని ఆయనను కలిసిన ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. తిరుమల వెంకన్న బ్రేక్ దర్శనం చేసుకునే భక్తులకు వేసవి రద్దీ దృష్ట్యా గతంలో సిఫారసు లేఖలపై రద్దు చేసిన టీటీడీ తిరిగి ఇప్పుడు వాటిని పునరుద్ధరించిన సందర్భంగా చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపారు.



కొత్తూరు-షాద్‌నగర్ రోడ్డుపైనే నిలిపిన వాహనాలు



పెంజర్ల రోడ్డులో ట్రాఫిక్‌జామ్

ట్రా'ఫికర్'

- కొత్తూరులో రోజురోజుకు పెరుగుతున్న సమస్య
- రోడ్లపైనే ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పోలీసులు

కొత్తూరు: రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ప్రధానంగా మారింది. స్థానికంగా పారిశ్రామికవాడ ఉండడంతో ఆయా ప్రాంతాల నుంచి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు మండల కేంద్రం నుంచి రాకపోకలు కొనసాగిస్తుంటాయి. దానికితోడు మండలం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే వాహనాల సంఖ్య కూడా వందల్లోనే ఉంటుంది. ఏమాత్రం రోడ్డుపై ఆటోలు, జీపులు నిలిపినా నిమిషాల వ్యవధిలోనే పదుల సంఖ్యలో వాహనాలు ఆగిపోతున్నాయి. ముఖ్యంగా కొత్తూరు-షాద్‌నగర్ పాత జాతీయ రహదారి, కొత్తూరు-జేపీదర్గా, కొత్తూరు-పెంజర్ల రోడ్డులో ట్రాఫిక్ సమస్య మరింతగా పెరుగుతోంది.

రోడ్ల విస్తరణ జరిగినా తప్పని తిప్పలు

గతంలో మండల కేంద్రంలో రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. కాగా మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన తర్వాత కొత్తూరు-పెంజర్ల, కొత్తూరు-జేపీ దర్గా, కొత్తూరు-షాద్‌నగర్ రోడ్లను విస్తరించారు. అయినప్పటికీ కొందరు వాహనదారులు ఇష్టారాజ్యంగా వ్యాపార సముదాయాలు, బ్యాంకులు, హోటళ్ల ఎదుట వాహనాలను నిలుపుతున్నారు. దీంతో తరచూ పలు కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

వాహనాల పార్కింగ్

పట్టణంలోని స్థానిక ప్రజలతో పాటు ఆయా ప్రాంతాల నుంచి పలు దుకాణాలు, ఇతర పనుల నిమిత్తం వచ్చే వాహనదారులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. కొందరు దుకాణాల నిర్వాహకులు కూడా రోడ్డు సమీపం వరకు తోపుడు బండ్లు, టీ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. అసలే సింగిల్ రోడ్డు కావడంతో వీటి నిర్వహణతో రోడ్డు మరింత ఇరుకుగా మారుతోంది. దానికి తోడు జేపీదర్గా, పెంజర్ల, షాద్‌నగర్ వైపునకు వెళ్లే ఆటో, జీపు డ్రైవర్లు ప్రయాణికులను ఎక్కించుకోవడానికి పోటీలు పడి వాహనాలను రోడ్డు మధ్యలో నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతోంది. ట్రాఫిక్ సమస్యపై తరచూ పత్రికల్లో కథనాలు వస్తున్నప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సాయంత్రం వేళలో తీవ్ర ఇబ్బందులు



పట్టణంలోని జేపీదర్గా, పెంజర్ల రోడ్డులో విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. దుకాణాలు, కూరగాయల కొనుగోలు కోసం వచ్చేవారు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. రోడ్డు వెడల్పు 50 ఫీట్లు ఉన్నప్పటికీ ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– సోమ్లానాయక్, కొత్తూరు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. తమ వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేయొద్దు. ముఖ్యంగా వ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూసుకోవాలి. తమ దుకాణ సముదాయాల ఎదుట వాహనాలను పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలి. నిబంధనలు పాటించని వాహనదారులకు చలాన్లు విధిస్తాం.

– నర్సింహారావు, సీఐ, కొత్తూరు

బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తుంటే, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాసమస్యలను గాలికి వదిలేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులు సొంత ఆస్తులను పెంచుకునేందుకే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చారని ఆయన ఆరోపించారు. మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట, బైర్కాన్‌పల్లి గ్రామాల్లో మంజూరైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు శనివారం ఆయన భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ పదేళ్ల కాలంలో షాద్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా ఉన్న అంజయ్య యాదవ్ సొంత గ్రామంలో అండర్ డ్రైనేజీని కూడా పూర్తిస్థాయిలో నిర్మించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 90 శాతం మంది రైతుకు ఏకకాలంలో రుణమాఫీ చేశామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని, రేషన్‌కార్డుల ద్వారా సన్నబియ్యం అందిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే సొంత గ్రామమైన ఎక్లాస్‌ఖాన్‌పేట అభివృద్ధి కుంటుపడిందని, గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేసి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. వచ్చే నెలలో నూతనంగా రేషన్‌కార్డులను అందిస్తామని వెల్లడించారు. గ్రామాల్లో అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లను విడతల వారీగా అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జగదీశ్వర్, బాలరాజ్‌గౌడ్, యాదయ్య యాదవ్, శ్రీధర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, అంజయ్య, రమేశ్, గుండె రాణి, గిరియాదవ్, తహసీల్దార్ అజాంఅలీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య, ఏఈ నర్సింగ్‌రావు, నాగిళ్ల భాస్కర్, రూప్లానాయక్, సుందరయ్య, భీమయ్యతో పాటు వివిధ గ్రామాల కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ముగిసిన రెవెన్యూ సదస్సులు

కొందుర్గు: భూ భారతి చట్టం అమలులో భాగంగా ప్రభుత్వం జిల్లాకు ఓ మండలాన్ని ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్టుగా రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. ఇందులో భాగంగా కొందుర్గు మండలాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కొందుర్గు మండలంలో ఈ నెల 5వ తేదీ నుంచి 16వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. 20 రెవెన్యూ గ్రామాల్లో మొత్తం 1120 దరఖాస్తులు అందాయని, ఇందులో 573 దరఖాస్తులు ఆమోదించినట్లు తహసీల్దార్ రమేశ్‌కుమార్ స్పష్టం చేశారు. అత్యధికంగా వెంకిర్యాలలో 200ల దరఖాస్తులు అందాయని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయం, రామాలయాలంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో రవీందర్‌యాదవ్ పాల్గొన్నారు. అనంతరం పీఏసీఎస్ డైరెక్టర్ జగదీశ్వరప్ప సహాయంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

విద్యార్థి చదువుకు ఆర్థికసాయం

షాద్‌నగర్: పట్టణంలోని హాజిపల్లిరోడ్డులో గల శ్రీ సహస్రలింగేశ్వరస్వామి దేవాలయంలో విష్ణు సహస్ర పారాయణం అధ్యక్షుడు స్వరాజ్‌బాబు నిరుపేద విద్యార్థిని చదువుకు శనివారం ఆర్థికసాయం అందజేశారు. పట్టణానికి చెందిన మల్లేశ్ కూతురు పూజ ఎంబీబీఎస్ విద్యనభ్యసిస్తోంది. పేద కుటుంబానికి చెందిన విద్యార్థి కావడంతో చదువుకు కొంత సాయంగా ఆయన రూ.8వేలు అందించి చేయూతనిచ్చాడు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. భక్తుల భజనలు, పాటలు, ఆంజనేయస్వామి, శ్రీరాముడి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. పట్టణానికి చెందిన కాటరాజేశ్వర్ తన కుమారుడు ఎంసెట్‌లో ర్యాంకు సాధించిన సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. దేవాలయ అభివృద్ధికి నీరజాక్షినాయుడు రూ.2,500ల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు పులిమామిడి శ్రీశైలం గౌడ్ దాతలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రఘుగౌడ్, రమేశ్, అశోక్, శంకర్‌గౌడ్, రమేశ్‌అప్ప, క్యాసెట్ శ్రీనివాస్, సతీష్, కిషన్‌నాయక్, రాఘవేందర్, నారాయణ, కృష్ణయ్య, లక్ష్మికాంత్‌రెడ్డి, కృష్ణచారి, బచ్చన్న, యాదగిరి, శంకరయ్య, ప్రవీణ్‌గౌడ్, వెంకటేశ్, గోరియానాయక్, భక్తులు పాల్గొన్నారు.



భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఆపరేషన్ సిందూర్ ఎంతో గర్వకారణం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య

షాద్‌నగర్‌రూరల్: ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం మనకెంతో గర్వకారణమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై హైదరాబాద్‌లో నిర్వహించిన త్రివర్ణ పతాక ర్యాలీకి ఆయన ఆధ్వర్యంలో నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత ఆర్మీ జవానులు తమ ప్రాణాలను లెక్క చేయకుండా దాయాది దేశంపై చేసిన పోరాటం ఎంతో గొప్పదన్నారు. దేశభక్తి అంటే ఒక పార్టీకి పరిమితమయ్యే విషయం కాదని, ప్రతీ భారతీయుడు తలెత్తి దేశభక్తిని చాటిచెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ర్యాలీకి తరలిన వారిలో నేతలు మల్చలం మురళీ అందె నర్సింహ, శ్రీను, సుబ్బు, అంజి, ప్రశాంత్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవానుల పోరాటం ఎంతో గొప్పది

చేవెళ్ల: భారత ఆర్మీ జవానులు తమ ప్రాణాలను లెక్క చేయకుండా దాయాది దేశంపై చేసిన పోరాటం ఎంతో గొప్పదని బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై శనివారం హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీకి చేవెళ్ల నుంచి బీజేపీ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్రివిధ దళాలు అందించిన సేవలకు కృతజ్ఞతగా మన ఐక్యత చటడానికి ఈ తిరంగా ర్యాలీకి పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఇది దేశం గర్వించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజనేయులుగౌడ్, శర్వలింగం, శ్రీనివాస్, శంకర్‌గౌడ్, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కృష్ణమోహన్, మహేందర్‌రెడ్డి, అభిషేక్, గోవర్ధన్, శివారెడ్డి, విష్ణు, నర్సింలు, శ్రీకాంత్, శంకర్‌చారి, భార్గవ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



షాద్‌నగర్‌రూరల్: త్రివర్ణ పతాక ర్యాలీకి తరలివెళ్తున్న నాయకులు



చేవెళ్ల నుంచి తిరంగా ర్యాలీకి బయలుదేరిన నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతుందని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఎల్గొండగూడ గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్న 25 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ తీసుకున్నారు. మిగతా 15 మంది విద్యార్థులను కూడా తమ పాఠశాలల్లో చేర్పిస్తామని వారి తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, మధ్యాహ్న భోజనం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రైవేట్‌కు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించామని గుర్తుచేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మౌలిక వసతులు కల్పిస్తున్నామని, పిల్లలను నిర్భయంగా చేర్పించవచ్చన్నారు. అనంతరం పాఠశాలలో ప్రహరీ నిర్మాణ పనులకు దాత రవీందర్‌రెడ్డితో కలిసి ఎంఈఓ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు రవీందర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, యాదయ్య, బల్‌రాం, శ్రీనివాస్‌చారి, మల్లారెడ్డి, సతీష్, రవి, శేఖర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



బాడిబాటలో ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు

కష్టపడిన వారికి తగిన గుర్తింపు



రాంచందర్‌కు నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్

షాబాద్: పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి తప్పకుండా పదవులు లభిస్తాయని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పొగాకు రమాకాంత్‌రావు పేర్కొన్నారు. శనివారం షాబాద్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని కేసారం గ్రామానికి చెందిన తొంట రాంచందర్‌ను చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడిగా నియమించి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి నిత్యం కృషి చేసిన కార్యకర్తలకు, నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత ఎన్నికలలో ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. గడిచిన 15 నెలలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. పార్టీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీరాంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పమెన భార్గవ్‌రామ్, చేవెళ్ల నియోజకవర్గ మాజీ యూత్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింలు, మంగలి చెన్నయ్య, మాజీ సర్పంచ్ బర్ల యాదయ్య, మార్కెట్ కమిటీ చేవెళ్ల నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చర్ల సంతోష్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు సురేందర్, నాయకులు బందయ్య, కుమార్, నర్సింలు, సాయి, కిరణ్‌రెడ్డి, ఖలీల్‌పాషా, వెంకటయ్య, వేణుగోపాల్, అమరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారం

జాతీయ బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జలజ

షాద్‌నగర్‌రూరల్: బీసీలు ఐకమత్యంతో ఏకతాటిపైకి వచ్చినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని జాతీయ బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మహాల్‌ఎలికట్ట గ్రామంలో జాతీయ బీసీసేన ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జలజ హాజరై మాట్లాడుతూ.. స్వాతంత్య్రం వచ్చినప్పటినుంచి బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. పాలకుల నిర్లక్ష్యంతో బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల ఓట్లతో గెలిచిన నాయకులు అధికారంలోకి వచ్చాక వారి సమస్యలను పట్టించుకున్న పాపానపోలేదని వాపోయారు. బీసీలు రాజ్యాధికారాన్ని సాధించినప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. బీసీలను ఏకం చేసేందుకు గ్రామగ్రామాన కమిటీలను వేస్తున్నామని, మీకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామన్నారు. అనంతరం బీసీసేన మహిళా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షురాలిగా పుట్టపాటి రమాదేవి, ఉపాధ్యక్షులుగా అనుప అంజమ్మ, జంగం పావని, ప్రధాన కార్యదర్శిగా పిట్టల రజిత, ట్రెజరర్‌గా జెల్ల సునీత, సభ్యులుగా గోనెల లక్ష్మి, చిన్నజంగం స్వప్న, జంగం అనితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ బీసీసేన అసెంబ్లీ మహిళా ప్రధాన కార్యదర్శి సౌజన్య, మండల మహిళా ఉపాధ్యక్షురాలు ప్రవంతిరాజ్, పట్టణ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, నాయకులు శ్రీనివాస్, సుధాకర్, నరేశ్, చంద్రశేఖర్, వెంకటేశ్, పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు